క్లుప్తంగా

కేజీఆర్ఎల్‌లో స్పోర్ట్స్ వీక్ సెలబ్రేషన్స్


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మసీ స్పోర్ట్స్ వీక్ సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫార్మసీ డైరెక్టర్ కె నాగేశ్వరరావు మాట్లాడుతూ స్పోర్ట్స్ వీక్ సెలబ్రేషన్స్‌లో విద్యార్థులకు క్రికెట్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, షటిల్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డి రాఘవ, వైస్ ప్రిన్సిపల్ కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్పీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్

కాళ్ల: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్తనుంచి సంపదను సృష్టించాలని డీపీఆర్పీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్ అన్నారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో గురువారం చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఇంటింటికి తిరిగి క్లాప్ మిత్రలు సేకరించిన తడిచెత్త, పొడి చెత్త గురించి, పరిసరాల శుభ్రత, సింగల్ యూజ్ ప్లాస్టిక్ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు, ఉపసర్పంచ్ నల్లగచ్చు ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు, ఈఓపీఆర్డీ ఎంవి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

నరసాపురం: శ్రీరామనవమి పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం నరసాపురం డిపో నుంచి భద్రాచలానికి ఈ నెల 5న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఈ బస్సు బయలుదేరుతుందని చెప్పారు. పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, కుక్కునూరు మీదుగా భద్రాచలం చేరుకుంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వారియోగం చేసుకోవాలని చెప్పారు.

ఉదయగిరి సర్వీస్‌కు స్పందన

ఈ నెల 1న నరసాపురం నుంచి ఉదయగిరికి ప్రతిరోజూ తిరిగేలా ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ సర్వీస్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తుందని డీఎం వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 4.15 గంటలకు నరసాపురంలో బయలుదేరుతుందని చెప్పారు. పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కై కలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కనిగిరి, పామూరు మీదుగా ఉదయగిరి చేరుకుంటుందని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆకివీడు: రైతులకు మద్దతు ధర లభించే విధంగా అధికారులు కృషిచేయాలని, రైతులు సహకరించాలని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం నేరుగా మిల్లులకు తోలుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జేడీ జెడ్. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లను కేటాయించాలని వినతి


రైల్వే డీఎం నరేంద్ర పటేల్‌తో రైల్వే జోన్ మెంబర్లు

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుత వేసవికాలం రద్దీ కారణంగా హెదరాబాద్, బెంగుళూరుకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర పటేల్‌ను కోరినట్లు రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ జక్కంపూడి కుమార్ అన్నారు. బుధవారం విజయవాడలో రైల్వే డీఎంను కలిసి పలు సమస్యలపై చర్చించామని గురువారం విలేకరులకు తెలిపారు. నరసాపురం వైజాగ్ ట్రైన్‌ను రెగ్యులర్ చేయాలని, అలాగే వీక్లీ ఒకసారి నడిచే నరసాపురం-బెంగుళూరు స్పెషల్ ట్రైన్‌ను రోజూ నడిచే విధంగా కృషి చేయాలని కోరామన్నారు.

ఎన్ఎల్ఆర్ సాగుపై ఆసక్తి

- ఆరోగ్యాన్ని అందించే బియ్యం ఎన్ఎల్ఆర్ 3238
- మంచి ఫలితాలిస్తున్న సాగు
- బియ్యంలో జింక్ 22.5 శాతం
- గర్భిణులకు మంచి ఆహారం


కుప్పనపూడి గ్రామంలో సాగు చేస్తున్న ఎన్ఎల్ఆర్ 3238

ఆకివీడు: అన్నం తినవద్దు, సుగర్ పెరిగిపోతుందని అలాగే బియ్యంతో వండిన ఆహారం తినడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని అని చెబుతున్నవారికి చెక్ పెట్టేందుకు ఎన్ఎల్ఆర్ 3238 (బయోఫోర్టుఫైడ్)వంగడం సిద్ధమైంది. వివాహ భోజనంబు అంటూ కొత్త వరి వంగడం అన్నం భుజించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కరోనా మహమ్మారి వచ్చిన తరువాత ప్రజల్లో రోగ నిరోధక శక్తి బాగా తగ్గిపోయింది. విటమిన్-సీ, జింక్ ట్యాబ్లెట్స్ అధికంగా వాడాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో బియ్యంలోనే పోషకాలు ఉండే విధంగా వంగడాలను తయారు చేసి ప్రజల చెంతకు చేర్చాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు ముందుకు వచ్చారు. ఆ దిశగా నెల్లూరు వరి పరిశోధనా సంస్థ రూపొందించిన ఎన్ఎల్ఆర్ వంగడం 3238 మినీ కిట్ సాగు ద్వారా మంచి విజయాల్ని సాధించింది.

దిగుబడిలో బాగు

జిల్లాలోని మండలానికో ఎకరం(15 కేజీలు) సాగుకు అందజేయడంతో రబీ సాగులో మంచి దిగుబడుల్ని అందిస్తుంది. మార్టేరు వరి పరిశోధనా సంస్థ రూపొందించిన ఎంటీయూ 1010 వంగడం, బాపట్ల వరి పరిశోధనా సంస్థ రూపొందించిన 5204 వంగడంతో సంక్రమణం చేసి నెల్లూరు వరి పరిశోధనా సంస్థ ఎన్ఎల్ఆర్ 3238 వంగడాన్ని సృష్టించింది. వచ్చే రబీ సీజన్ నుండి రైతు క్షేత్రంలో సాగు చేసేందుకు విత్తనాల్ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత రబీసాగులో అధిక దిగుబడుల సాధనలో పంట ఉంది. దీని విత్తనాలకు మంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

3238 ప్రత్యేకతలివే

నెల్లూరు వరి పరిశోధనా సంస్థ రూపొందించిన 3238 వంగడం బాక్టీరియాను తట్టుకునే గుణం ఉంది. వైరస్‌లను ఎదుర్కొనే సత్తా ఉంది. బియ్యంలో 22.5 శాతం జింక్ కలిగి ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. గర్భిణులకు మంచి పోషకాహారంగా వంగడం ఉంది. యాంటీ ఆక్సిడెంట్స్‌ను పెంపొందిస్తుంది. సన్నరకంగా బియ్యం ఉండటంతో భోజన ప్రియులు భుజించేందుకు అనుకూలంగా ఉంది. అన్నం ముద్ద అవ్వకుండా ఉంటుంది.

వరి సాగులోనూ విశిష్టతలివే

3238 వంగడం సాగులోనూ రైతులు మంచి ఫలితాల్ని సాధిస్తున్నారు. వరిని దోమ, ముడత, తెగుళ్లు, చీడ పీడలు ఆశించకుండా కాపాడుకుంటుంది. స్వల్పకాలంలో పంట చేతికి అందుతుంది. వరి మొక్క కుదుమట్టంగా ఉండటంతో గాలులకు పడిపోకుండా ఉంటుంది.

సాగు చాలా బాగుంది



3238 సాగు చాలా బాగుంది. ఎకరంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేశాను. మందులు పిచికారీ చేయ లేదు. ఎరువు ఒక్కసారి మాత్రమే వేశాను. తెగుళ్లు, దోమ లేదు. 23 రోజుల్లోనే ఊడ్పులు వేయాలి. తక్కువ పెట్టుబడి అయ్యింది. అలాగ దిగుబడి ఆశాజనకంగా ఉంది. 45 బస్తాల పైబడి ఉంటుంది. మొక్క ఎదుగుదల తక్కువ, కంకులు కంటికి ఇంపుగా ఉన్నాయి. గడ్డితో పాటు వడ్లు సమానంగా వచ్చే అవకాశం కన్పిస్తుంది. గింజ ధృఢంగా ఉంది.

– నంద్యాల చల్లారావు, ఆదర్శరైతు, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

అన్ని ప్రాంతాల్లో సాగు



ఎన్ఎల్ఆర్ 3238 సాగు జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక ఎకరం చొప్పున సాగు చేపట్టారు. ప్రస్తుతం మాసూళ్లు పూర్తి అయిన తరువాత బియ్యం తినడానికి ఏ విధంగా ఉపయోగపడుతాయో? వేచి చూడాలి. విత్తనాలను మాత్రం రైతులు అధికంగా అడుగుతున్నారు. ప్రస్తుతం సాగులో వచ్చిన వంగడాల్ని వచ్చే ఖరీఫ్‌లో సాగు చేసి విత్తనాలుగా సృష్టించుకోవచ్చు.

– జెడ్. వెంకటేశ్వర్లు, పశ్చిమ జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


అనాకోడేరులో డీఎన్నార్ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ప్రపంచ దేశాలు అభివృద్ధి వేగంగా చెందుతున్నప్పటికీ అడవులు నరికివేయడం పరిశ్రమలు నిర్మించడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ ప్రతి ఏడాది ఎక్కువ అవుతుందన్నారు. దీంతో సకాలంలో వర్షాలు పడకపోవడంతో అతివృష్టి, అనావృష్టిలు వచ్చి పంటలు పండటం లేదన్నారు. దీంతో ప్రజల జీవనస్థితిగతులపై పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, జి. నర్మద, ఎంవీ శ్రీలక్ష్మి, కె. రాజేష్ కుమార్ రాజు, బి. రత్నకుమారి, డి. కనకరత్నం, సీహెచ్ జలాబాయి, వై. శకుంతల, ఎమ్ బాల పల్లాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందర్శనకు గాంధీభవన్‌లో ఏర్పాట్లు


పెదనింద్రకొలను గ్రామంలోని మహాత్మాగాంధీ భవనం దృశ్యం

భీమవరం: నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలోని మహాత్మాగాంధీ భవనం విద్యార్థులు వేసవి సెలవుల్లో సందర్శించడానికి ఏర్పాటు చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం చెప్పారు. గాంధీభవనం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు సందర్శించే విధంగా తెరిచిఉంచే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గాంధీ భవన్‌లో గాంధీజీ జీవితచరిత్ర ఘట్టాలు, దేశం కోసం పోరాడి అమరులైనవారి ఫొటోలు, నాలెడ్జ్ సెంటర్ ఉంటాయని ప్రసాదరాజు వివరించారు. పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దిన గాంధీభవనాన్ని విద్యార్థులు సందర్శించవచ్చునన్నారు.

విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం


ఏఆర్‌కేఆర్ స్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని ఏఆర్‌కేఆర్ మునిసిపల్ హైస్కూల్లో ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్, పరిశోధన, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన 21 ప్రాజెక్టులను సమర్పించారు. వాటిలో నరసాపురం పట్టణంలోని నక్కావారిపేట మహాత్మాజ్యోతిపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ప్రథమ బహుమతి, గణపవరం మండలం కేశవరం స్కూల్ ద్వితీయ బహుమతిని గెల్చుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పి శ్యామ్‌సుందర్, జిల్లా అకడమిక్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి శ్యామ్‌ప్రసాద్, ప్రొగ్రామ్ జిల్లా మేనేజర్ ఎం వెంకటరమణ, స్కూల్ హెచ్ఎం ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే నిర్వహణపై అవగాహన


మహదేవపట్నంలో మాట్లాడుతున్న అధికారులు

ఉండి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని అధికారులు ఖచ్చితత్వంతో నిర్వహించాలని తహసీల్దార్ నాగార్జున అన్నారు. గురువారం మహదేవపట్నంలో -రీసర్వే కార్యక్రమంపై రైతులు, ప్రజలకు అవగాహన ర్యాలీ అనంతరం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీశ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వం హయాంలో 60 శాతం రీ-సర్వే పూర్తయ్యిందని మండల వ్యాప్తంగా మిగిలిన 6 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలనే ప్రభుత్వాదేశాలతో ఇప్పుడు రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, వనిమా శ్రీనివాస్, ఆర్ఐ కార్తీక్, మండల సర్వేయర్ రత్నవల్లి, వీఆర్వోలు ఎస్ చిన్నారావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఆర్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం


భీమవరంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: తొంభై ఏళ్ల క్రితం భారతదేశ ద్రవ్య ఆర్థిక స్థిరత్వానికి సంరక్షకుడిగా ఏర్పడిన ఆర్‌బీఐ మారుతున్న ఆర్థిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందిందని భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛీఫ్ మేనేజర్ ఎం నిర్మలజ్యోతి అన్నారు. రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు సందర్భంగా భీమవరం యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం ప్రకారం 1934లో స్థాపించి ప్రారంభంలో ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ 1949లో జాతీయం చేయబడిందని, అప్పటి నుంచి పూర్తిగా భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా 27 మంది విద్యార్థులకు బ్యాంక్ విధి విధానాలపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఆర్ వెంకన్న బాబు, కె పార్వతి, వి జ్ఞాన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


ఆకివీడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద క్యూలైన్‌లో దరఖాస్తుదారులు

ఆకివీడు: చంద్రన్న ఉపాధి సోపానం పథకం కింద వివిధ కార్పొరేషన్‌లు అందించే రుణాల కోసం దరఖాస్తుదారులకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీల పరిధిలోని దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మండలంలో స్వయం ఉపాధి పథకం 37 యూనిట్లు మంజూరు కాగా వాటిలో బీసీలకు 25, ఓబీసీ 1, కాపు కార్పొరేషన్ రుణాలు 10, ఎంఎస్ఎంఈ 1 యూనిట్లకు మాత్రమే ఎంపిక జరుగనుంది. ఈ రుణాల కోసం మొత్తం 1482 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇంటర్వ్యూలకు 1000 మంది హాజరయ్యారు. 37 యూనిట్ల మంజూరు కోసం వెయ్యి మంది హాజరుకావడంతో పలువురు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

కాళ్లలో..

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. కాళ్ళ, కాళ్ళకూరు, కోలనపల్లి, కోపల్లె, పెదఅమీరం, ప్రాతాళ్లమెరక, సీసలి, వేంపాడు గ్రామాల్లో వివిధ యూనిట్లకు సంబంధించి లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న 567 మందికి రెండవరోజు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, చైతన్య గోదావరి బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డీసీఎస్ బ్యాంక్ బ్రాంచ్ ప్రతినిధులు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు చేశారని స్పష్టం చేశారు.

ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మొద్దు


సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు మధ్య దళారులను నమ్మి ధాన్యాన్ని విక్రయించవద్దని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని మోదుగ గుంట సచివాయలం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏడీఏ పి.మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాకు సొమ్ము జమ అవుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు మిల్లర్లు ఇచ్చిన ధాన్యం సంచులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. సంచులకు చిల్లులు ఉంటే వాటిని పక్కన పెట్టాలన్నారు. అలాగే, ధాన్యం విక్రయించిన వెంటనే ధాన్యం సొమ్ములు వివరాలతో కూడిన షీట్ వస్తుందని, ఆ వెంటనే రైతులు వెళ్లిపోవద్దని, వేలిముద్ర తప్పనిసరిగా వేయాలన్నారు. ధాన్యం సొమ్ములు రైతు ఖాతాకు జమ అవుతాయన్నారు. ధాన్యంలో తేమ శాతం తేడా లేకుండా సర్వర్లకు అనుసంధానించడం జరిగిందన్నారు. ఈ విషయాలను రైతులు గుర్తుంచుకోవాలన్నారు. రైతులు వాట్సాప్ గ్రూపు ద్వారా కూడా ధాన్యాన్ని ఇంటి వద్ద నుంచే విక్రయించవచ్చన్నారు. అయితే, ముందుగా ఏ రోజు ధాన్యం కోస్తున్నది, ఎన్ని బస్తాలు విక్రయిస్తున్నది వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం శివరాంప్రసాద్, ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, డీఎస్‌వో ఎన్. సరోజ, డీసీవో ఎం.నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖఅధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ, సర్పంచ్ కట్టా సత్యవతి, ఎమ్పీటీసీ దండుబోయిన విజయదుర్గ, కొమ్ముగూడెం సొసైటీ సీఈవో సీహెచ్ఎస్‌వీకే. శర్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇ.లక్ష్మీకాంతం, మాజీ ఉపసర్పంచ్ ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం ప్రారంభం

పెనుగొండ: పెనుగొండ గ్రామంలో రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. గురువారం చెరుకువాడలో తిలక్ రోడ్డులో సీసీ రహదారి నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. రూ.5 లక్షల పంచాయతీ నిధులతో ఈ రహదారిని నిర్మించనున్నారు.

అధ్వానంగా మొక్కల పెంపకం

నీళ్లేసే నాథుడే లేక ఎండిపోతున్న మొక్కలు


రైల్వేస్టేషన్ రోడ్డులో డివైడర్ల మధ్య ఎండిపోతున్న మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వాలు అట్టహాసంగా జరుపుతున్నాయి. స్థానికంగా మునిసిపాలిటీలో అయితే ఈ కార్యక్రమాన్ని మరీ హడావుడి చేశారు. పట్టణంలో లక్ష మొక్కలు పెంచడం ధ్యేయమంటూ అధికారులు హంగామా చేశారు. దీంతో పలు దఫాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎస్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వే స్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడంలేదు. ఆవులు, దూడలు తినేయడం, నీళ్ల వేయడం లాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో చచ్చిపోయాయి. సాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోనే మొక్కలకు నీళ్లుపోసేవారు లేక ఎండిపోతున్నాయి.

లక్ష మొక్కలు లేకపోయినా లక్షల్లో ఖర్చు

పట్టణంలో ఏకంగా లక్ష మొక్కలు నాటుతామని అప్పట్లో చెప్పారు. ప్రస్తుతం ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు. కానీ లక్షల్లో మునిసిపల్ నిధులు మాత్రం ఖర్చయ్యిపోయాయి. గత మూడేళ్లలో పట్టణంలో మొక్కలు పెంపకం కోసం రూ.8 లక్షలు ఖర్చుచేసినట్టు మునిసిపల్ రికార్డులను బట్టి తెలుస్తుంది. ప్రతిఏటా మునిసిపల్ బడ్జెట్‌లో మొక్కల పెంపకానికి నిధులు కేటాయిస్తున్నారు. కానీ కొత్తగా ట్రీగార్డులు మాత్రం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. అంతేకాదు, కొన్ని చోట్ల పాతట్రీగార్డులు ఉన్నాయి. గతంలో మొక్కలు వేసి, ట్రీగార్డులు ఉంచిన ప్రాంతాల్లో ఆ మొక్కలు పెరిగిపోయి ట్రీ గార్డులు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఆ స్థానాల్లో తీసి, కొత్తగా మొక్కలు పాతినచోట ఏర్పాటు కూడా చేయడం లేదు. వేసవి వచ్చేసింది. ఎండలు పెరిగిపోయాయి. మొక్కల సంరక్షణపై ఇప్పటికైనా దృష్టిపెట్టకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం టిడ్కో విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌పై చెట్లు కొమ్మలు తొలగించడానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడ్కో గృహాలకు, తాడేరురోడ్డులోని గృహాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాలాత్రిపురసుందరీ దేవికి ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మెంటేవారితోటలోని బాలాత్రిపరసుందరీ దేవికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన కడియం సతీష్ కుమార్, రామ అరుణ నాగ ఫణిజ దంపతులచే అమ్మవారికి కుంకుమార్చన, నక్షత్ర హారతులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారె అందజేశారు. భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులతో స్థిరమైన ఉపాధి పొందాలి

భీమవరం: ఐటీఐ కోర్సుల్లో విద్యను అభ్యసించి స్థిరమైన ఉపాధిని పొందాలని రాష్ట్ర ఉపసభాపతి, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణ రాజు విద్యార్థులకు దిశా నిర్దేశించారు. గురువారం భీమవరం ఐటీఐలో ఇండస్ట్రియల్ మేనేజ్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో (ఐఎంసి) ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఐటీఐ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యమైనదన్నారు. పరిశ్రమలలో ఐటీఐ కోర్సులు చదివిన వారు అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. ఉద్యోగంలో చేరిన మొదటి సంవత్సరం చాలా విలువైనదని, అనుభవంతో పాటు, శాలరీలో కూడా పెరుగుదలకు ఉంటుందన్నారు. భవిష్యత్తులో మంచి అవకాశాలను పొందడానికి అనుభవం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎం.సి చైర్మన్ సామంతపూడి బాలకృష్ణంరాజు, ఐటిఐ ప్రిన్సిపాల్ వేగ్నేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చేతి వృత్తితో భవిష్యత్‌పై ధీమా

ఉండి: చేతి వృత్తి మనిషికి మరింత గౌరవాన్ని తెచ్చిపెడుతుందని భవిష్యత్‌పై ధీమా కలుగుతుందని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో చైర్మన్ బాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఐటీఐ విద్య, ఉద్యోగావకాశాలు వంటి అంశాలపై విద్యార్థులతో మాట్లాడి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ట

పెనుగొండ: మండలంలోని వడలి అగస్త్యేశ్వర స్వామి ఆలయం గాలి గోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి పూజ, అగస్త్యేశ్వర స్వామికి అభిషేకాలు, పార్వతీ మాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. పుణ్యాహవచనం, పంచగవ్యం నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య శిఖర ప్రతిష్ఠ వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కోలాట భజన ఆకట్టుకుంది.